సాక్షి
అనంతపురం


మహిళా దినోత్సవం

శనివారం । 8 । మార్చి । 2025



వనితా వందనం

- వివిధ రంగాల్లో మహిళల ప్రతిభ
- పురుషులతో దీటుగా రాణిస్తున్న వైనం



ఆది యందు 'ఆమె' ఉండెను
అప్పటి నుంచీ అన్నీ 'ఆమె' అయెను...
బడిలో, గుడిలో, నారుమడిలో..
ఆమెలేని చోటులేదు..ఆమెకు సాటి లేదు..
కలం పట్టినా...హలం దున్నినా..
అధికారం చూపినా..అక్కున చేర్చుకున్నా..
అంతా ఆమె...అన్నింటా ఆమె..
సృష్టి, స్థితి, లయకారులకూ 'ఆమె'నే ధైర్యం..
'ఆమె'కెన్నో రూపాలు.. మనం కూడా ప్రతిరూపాలమే..
ఆమె ఒక ధైర్యం..ఆ ఆదరణ లేకపోతే అంతా శూన్యం..
ఆమెను తలిస్తే అన్నీ దర్శించినట్టే..
అందుకే ఆమె కోసం ఓ రోజు..

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బతుకుపాఠంలో చెరగని ముద్ర వేసిన మహిళా మణుల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం..

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

భూ'దేవి' ఓర్పు



వృద్ధుల సేవలో దేవి

అనంతపురం రూరల్ మండలం కాట్నేకాలువలో ఆశ్రయ అనాథాశ్రమంలో పాతికమందికి పైగా వృద్ధులు. అందులో సగం మంది మతిస్థిమితం లేని వారే. అటువంటి వారికి సేవలందించాలంటే భూదేవంత ఓర్పు ఉండాలి. అంతకు మించిన సేవాభావం యర్రగుంట్ల దేవికి ఉంది. అందుకే అనాథలకు అమ్మగా మారి వారి సేవలోనే జీవితాన్ని సాగిస్తోంది. భర్త కృష్ణారెడ్డితో కలిసి అనాథాశ్రమం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా దేవి ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు విసుగు, విరామం లేకుండా వృద్ధులను ఆప్యాయతతో పలకరిస్తూ.. మతిస్థిమితం లేని వారు చేసే చేష్టలను సైతం ఓర్పుతో భరించి సేవలందిస్తోంది. రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి అవార్డులందుకున్నా సేవలో ఉండే సంతోషం మరెక్కడా లేదంటోంది దేవి. అనాథల అమ్మగానే ఉండిపోవాలని ఆకాంక్షిస్తోంది.

– అనంతపురం కల్చరల్:

రైతుబిడ్డ నుంచి ప్రజా ప్రతినిధిగా..



వ్యవసాయ పనుల్లో ఎంపీపీ హేమలత

ఆత్మకూరుకు చెందిన సుబ్బర పోతక్క, సుబ్బర పెద్ద ఆంజనేయులు రైతు దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. అరటి, చీనీ, వరి, కర్బూజ, బొప్పాయి, వేరుశనగ, కంది, బంతిపూలు తదితర పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. చిన్నకుమార్తె సుబ్బర హేమలత తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనులు చేస్తూనే 2021లో బీటెక్ కోర్సు పూర్తి చేసింది. అదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు రావడంతో ప్రజాసేవ కోసం రాజకీయ అరంగేట్రం చేసింది. ఆత్మకూరు ఎంపీటీసీ–2గా గెలుపొంది.. మండల పరిషత్ అధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఓ వైపు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, మరో వైపు ఖాళీ సమయంలో వ్యవసాయ పనులు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. – ఆత్మకూరు:

స్వీపర్ సావిత్రమ్మ 'సూపర్'



ఇస్రో శాస్త్రవేత్త దేవేంద్రనాథ్‌తో తల్లి సావిత్రమ్మ

గుంతకల్లుకు చెందిన సుంకన్న, సావిత్రమ్మ నిరుపేద దంపతులు. వీరికి ఒక అమ్మాయి, ఇద్దరు బ్బాయిలు సంతానం. పదేళ్ల క్రితం భర్త కరెంట్ షాక్‌తో మరణించాడు. పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్న భర్త ఆశయాన్ని సావిత్రమ్మ ముందుకు తీసుకెళ్లాలని సంకల్పించింది. అవుట్‌సోర్సింగ్ కింద స్థానిక మున్సిపాలిటీలో స్వీపర్‌గా పనిచేస్తూ పిల్లలను చదివించింది. ఇంజినీరింగ్ చదివిన పెద్ద కుమారుడు దేవేంద్రనాథ్ ఇస్రోలో ఉద్యోగం సాధించాడు. కన్యాకుమారిలోని ఇస్రోలో గ్రూప్–సీ శాస్త్రవేత్తగా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. కుమార్తెకు వివాహం చేసి పంపింది. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పాసై 2019లో సావిత్రమ్మ బ్యాక్‌లాగ్ పోస్టుకు ఎంపికై అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో పబ్లిక్‌హెల్త్ వర్కర్(స్వీపర్)గా పనిచేస్తోంది. తన తల్లి సహకారంతోనే తాను ఈస్థాయికి ఎదిగానని, స్వీపర్‌గా పనిచేస్తూనే తమను ప్రయోజకులుగా తీర్చిదిద్దిందని ఇస్రో శాస్త్రవేత్త దేవేంద్రనాథ్ సంతోషం వ్యక్తం చేశారు.

– గుంతకల్లు టౌన్:

కూతురి భవిత కోసం పోరాటం



కూతురు దీవెనతో లలిత

భర్త అకాల మరణం.. చుట్టుముట్టిన అప్పులు.. అయినా ఆమె వెరవలేదు. వ్యవసాయంలో రాణిస్తూ కష్టాలను అధిగమిస్తూ కూతురికి ఉజ్వల భవిష్యత్తు అందించడం కోసం పోరాడుతోంది. వజ్రకరూరు మండలం పాతకడమలకుంట గ్రామానికి చెందిన సత్యనారాయణ, లలిత దంపతులు. వీరికి ఒక కుమార్తె ఉంది. తమకున్న ఐదెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ కూతురును చదవించేవారు. నాలుగేళ్ల క్రితం కుమార్తె దీవెన ఎంబీబీఎస్‌లో చేరింది. ఏడాది తిరిగేలోపే సత్యనారాయణ అనారోగ్యం బారినపడ్డాడు. అప్పులు చేసి రూ.40లక్షలు వెచ్చించి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. సత్యనారాయణ చనిపోయాడు. కూతురి ఎంబీబీఎస్ చదువు ఆగిపోయింది. అయితే లలిత మరికొంత భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ తన కుతూరు భవిష్యత్తు కోసం బయో మెడికల్ ఇంజినీరింగ్ కోర్సులో చేర్పించింది. – ఉరవకొండ:

అభాగ్యులకు అండగా నిలవాలని..



దివ్యాంగునికి మూడు చక్రాల సైకిల్ అందజేసిన ఫెమినైన్ సభ్యులు

ఆమె ఆలోచన పలువురిని కదిలించింది. అంతా ఒక సంఘంగా ఏర్పడి సామాజిక సేవవైపు నడిచారు. తాడిపత్రిలోని ఓంశాంతినగర్‌కు చెందిన భూమా రాగిణి సారథ్యంలో మొదట నలుగురు స్నేహితులతో కలిసి 'ఫెమినైన్' అనే సంస్థను ప్రారంభించారు. ఆస్పత్రిలో రోగులకు అన్నదానంతో ప్రారంభమైన సంస్థ సామాజిక సేవా కార్యక్రమాలు సోషల్ మీడియా ద్వారా వైరల్ అయ్యాయి. అలా మూడు నెలల వ్యవధిలోనే వివిధ జిల్లాల నుంచి మొత్తం 190 మంది మహిళలు ఇందులో సభ్యులుగా చేరి సేవలో పాలు పంచుకుంటున్నారు. ప్రతి సభ్యురాలు నెలనెలా సేవా కార్యక్రమాల కోసం కొంతమొత్తం వెచ్చిస్తున్నారు. అంతేకాదు సభ్యుల్లోని కుటుంబాల్లో పుట్టిన రోజు తదితర శుభకార్యాల సందర్భాలను పురస్కరించుకుని అభాగ్యులకు అవసరమైన సహాయాలను అందిస్తున్నారు. ఇప్పటి వరకు దివ్యాంగులకు వీల్‌చైర్లు, మూడు చక్రాల సైకిళ్లు, ఒంటరి మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్లు అందించారు. ఓ పేదరిక కుటుంబానికి ప్రతి నెలా రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. అలివేలు మంగ అనే దివ్యాంగురాలికి పింఛన్ తరహాలో ప్రతి నెలా రూ.1000 ఆర్థికసాయం అందిస్తున్నారు. వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, ఆస్పత్రుల్లో అన్నదానాలు నిర్వహిస్తున్నారు. – తాడిపత్రిటౌన్ :

సేవకు ప్రతిరూపం ప్రమీల



సేవామూర్తిఏజీ ప్రమీలారెడ్డి

అమ్మాయిల చదువులకు తోడ్పాటు అందించడం, సామాజిక సేవాకార్యకర్తగా పర్యావరణ కార్యక్రమాలు, చిన్నారుల సృజనను ప్రోత్సహించడం, విద్యాలక్ష్యాలను చేరుకోవడం కోసం నిత్యం పరితపిస్తుంటారు ఏజీ ప్రమీలారెడ్డి. వయసు ఎనిమిది పదులు దాటినా నేటికీ చురుగ్గా సమాజహితం కోసం పాటుపడుతుంటారు. క్షామపీడిత అనంత సస్యశ్యామలం కావడం కోసం విరివిగా మొక్కల పంపిణీ, పక్షులకు కృత్రిమ గూళ్ల ఏర్పాటుకు సహకరిస్తున్నారు. ముఖ్యంగా కరోనాపై పోరాట మహాయజ్ఞంలో ఏజీఎస్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆమె చూపిన చొరవ, 'హీల్ అనంతపురం' పేరుతో అందించిన సేవలు ఎంతోమందికి స్ఫూర్తినిచ్చాయి. నిరాశ్రయులకు, అనాథలకు, ఆశ్రమాల్లోని వృద్ధుల జీవితాల్లో వెలుగులు నింపడానికి వాహనాల ద్వారా ఆహార పొట్లాలు అందిస్తున్నారు. – అనంతపురం కల్చరల్:

బాలికల కోసం పనిచేయాలని...



సావిత్రిబాయి పూలే అవార్డు అందుకుంటున్న సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న (ఫైల్)


ప్రకాశం జిల్లా పామర్రు గ్రామానికి చెందిన భోగ్యం కృష్ణయ్య, పద్మావతి దంపతులకు నలుగురు సంతానం. ముగ్గురు కుమార్తెల్లో లక్ష్మీప్రసన్న ఒకరు. వారిని పెంచడానికి తండ్రి పడ్డ కష్టాన్ని ఆమె కళ్లారా చూశారు. ఉన్నత చదువులు చదివి ఒక స్థాయికి చేరుకుని బాలికలకు అండగా ఉండాలని భావించారు. పీజీ కోర్సు పూర్తవగానే లక్ష్మీప్రసన్న ఐసీడీఎస్‌లో సీడీపీఓగా ఉద్యోగం సాధించారు. తాను అనుకున్న లక్ష్యం నెరవేరిందని చాలా సంతోష పడ్డారు. ప్రకాశం జిల్లాలో ఎనిమిదేళ్లు పనిచేశారు. ఆ తర్వాత కళ్యాణదుర్గం సీడీపీఓగా వచ్చారు. విధి నిర్వహణలో భాగంగా పలు చోట్ల బాల్య వివాహాలను అరికట్టగలిగారు. లింగ వివక్ష లేకుండా చైతన్యవంతులను చేశారు. భ్రూణహత్యలు జరగకుండా వైద్య సిబ్బందితో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె సేవలను గుర్తించి 2020లో మహాత్మ జ్యోతిరావు పూలే ఫౌండేషన్ వారు తిరుపతిలో లక్ష్మీప్రసన్నకు 'సావిత్రి బాయి పూలే ఎక్సలెన్స్' అవార్డు అందజేశారు. ఈ అవార్డు ఆమెలో బాధ్యతను మరింత పెంచింది. – కళ్యాణదుర్గం:

న్యూస్‌రీల్

గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీఆర్ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ జీఏ విజయలత సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుత్తి బాలికల గురుకుల పాఠశాల, నూతిమడుగు బాలుర గురుకుల పాఠశాల, గార్లదిన్నె మైనార్టీ బాలుర పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదో తరగతిలో 80 సీట్లు (ఇంగ్లిష్ మీడియం), 6, 7, 8 తరగతుల్లో మిగిలిపోయిన ఖాళీలకు ఈ నెల 31లోపు https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు అర్హులేనని కన్వీనర్ స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు



ఫైళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి డాటెడ్ ల్యాండ్స్ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి నిర్వహించారు. చుక్కల భూములఫైళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్‌ను తొలగించేందుకు, పరిష్కార వేదికలో అందుతున్న అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గుంతకల్లు, గుత్తి తదితర మండలాలకు చెందిన నాలుగు కేసులను విచారణ చేసి.. రెండింటిని ఆమోదించారు. మరో రెండు కేసులను పునఃపరిశీలించాలని ఆదేశించారు.

ఫీజు పోరు జయప్రదం చేయండి

- విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం
- ఫీజురీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులపై తీవ్ర ఒత్తిళ్లు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కూటమి సర్కారుకు బుద్ధి చెప్పేందుకు ఈ నెల 12న నిర్వహించే 'ఫీజు పోరు'ను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి నిధులు విడుదల చేయాలని, వైద్య కళాశాలల సంఖ్యను కుదించరాదని 12న ఉదయం పది గంటలకు జెడ్పీ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేస్తామన్నారు. అధికారంలోకి వస్తే విద్యారంగానికి పెద్దపీట వేస్తామని చెప్పిన చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ ఇప్పుడు మాట తప్పారన్నారు. విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రూ.3,900 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాల్సి ఉంటే రూ.700 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయన్నారు. ఒత్తిడి తట్టుకోలేకపోయిన పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. 2014–19 టీడీపీ హయాంలో పెండింగ్‌లో ఉన్న రూ.1,900 కోట్ల బకాయిలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించిందన్నారు. 2019 నుంచి 24 వరకు ఐదేళ్ల పాలనలో ఉన్నత విద్యకే రూ.26 వేల కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి సర్కారు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చినా.. బడ్జెట్‌లో కేటాయింపులే లేవన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో కొత్తగా 16 వైద్య కళాశాలలు మంజూరు చేయిస్తే.. కొత్తవి అవసరం లేదని సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. అంతేకాక పీపీపీ విధానంలో వైద్యకళాశాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారని, అలా చేస్తే వైద్యవిద్య పూర్తిగా ప్రైవేట్‌పరం అవుతుందని అన్నారు.

వెడల్పు చేశాక లైనింగ్ చేపట్టండి

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తదితరులకు రాయలసీమపై చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే మొదట హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేసి.. ఆ తర్వాత లైనింగ్ పనులు చేపట్టాలని అనంత డిమాండ్ చేశారు. రాయలసీమ కరువును చూపి కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని.. ఇక్కడి ప్రజలకు న్యాయం చేయకపోతే ఎలాగ అని ప్రశ్నించారు. వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేపడితే భవిష్యత్తులో అధికంగా నీరు తెచ్చే పరిస్థితి ఉండదన్నారు. 40 టీఎంసీల సామర్థ్యంతో హంద్రీ–నీవా కాలువ తవ్వారని, అయితే 12 పంపులున్నా 2,200 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోందని అన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో 6,300 క్యూసెక్కుల సామర్థ్యాన్ని పెంచుతూ జీఓను విడుదల చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం 3,850కే క్యూసెక్కులకు సరిపెట్టారన్నారు. పోలవరం ప్రాజెక్టు మరో రెండేళ్లలో పూర్తవుతుందని, గోదావరి జలాలను పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా బనకచర్లకు నీటిని తీసుకువచ్చి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చంద్రబాబు చెబుతుండడం సంతోషకర విషయమైనా.. బనకచర్ల ద్వారా అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. కేవలం కర్నూలు, కడపకు మాత్రమే నీరు తీసుకెళ్లేందుకు వీలుంటుందన్నారు. 10 వేల క్యూసెక్కులకు హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేయడానికి మంత్రి కేశవ్, టీడీపీ ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. అలా కాకుండా 3,850 క్యూసెక్కులకే పరిమితం చేస్తే రాయలసీమ ప్రజలకు ద్రోహం చేసిన వారిగా కూటమి పాలకులు చరిత్రలో నిలిచిపోతారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌గౌడ్, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, చింతకుంట మధు, సైఫుల్లాబేగ్, రాధాకృష్ణ, దత్తా, చంద్రశేఖర్ యాదవ్, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష కేంద్రాల పెంపు

అనంతపురం ఎడ్యుకేషన్: మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి ప్రవేశాలకు నిర్వహించనున్న రాత పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాలను పెంచారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 16 కేంద్రాలు ఉండగా.. దరఖాస్తులు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో అదనంగా ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అనంతపురం జిల్లా కన్వీనర్ జోనాథన్ తెలిపారు. కొత్త పరీక్ష కేంద్రాలు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో కనిపిస్తాయని పేర్కొన్నారు. ఏవైనా సందేహాలుంటే 98665 59653, 90523 16764 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అదనంగా పెంచిన కేంద్రాలివే..

- ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహం, కళ్యాణదుర్గం
- ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహం, శింగనమల (అనంతపురం రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ పక్కన)
- ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహం, నార్పల (అనంతపురంలోని కొత్తూరు బాలుర జూనియర్ కళాశాల)
- ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహం, నార్పల (అనంతపురం హౌసింగ్‌బోర్డు మెయిన్ రోడ్డు ఎస్‌వీఆర్ కేఫ్ పక్కన)
- ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం, రాయదుర్గం
- ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహం, అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వెనుక, అరవిందనగర్)
- ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహం, మోడల్ స్కూల్ దగ్గర ధర్మవరం

చిప్‌లు అమర్చి.. అక్రమార్జన



మాట్లాడుతున్న రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్

అనంతపురం: కొన్ని పెట్రోల్ బంకుల్లో మోసాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. ఫిల్లింగ్ యంత్రాల్లో చిప్‌లు అమర్చి.. రీడింగ్ మీటరుపై చూపిన దానికంటే ఆరు నుంచి పది శాతం తక్కువ ఇంధనం నింపుతున్నారు. అనుమానం వచ్చి పరీక్షించినా ఎక్కడా దొరకకుండా అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ వాహనదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఇది వరకు జిల్లాలో రెండు పెట్రోల్ బంకుల్లో చిప్ అమర్చి తక్కువ ఇంధనం పడుతున్నారని విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో తేలింది. తాజాగా అనంతపురంలోని నడిమి వంక నుంచి బళ్లారి బైపాస్‌కు వెళ్లే రోడ్డులోని విజయ ఫిల్లింగ్ స్టేషన్‌లో ఇదే తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల్లో బయటపడింది. అదే పెట్రోల్ బంకులోనే రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వైబీపీటీఏ ప్రసాద్ శనివారం విలేకరులతో మాట్లాడారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి లీటర్‌కు 60 నుంచి 100 ఎంఎల్ ఇంధనం తక్కువగా వాహనాలకు పడుతున్నారన్నారు. ఎవరైనా వాహనాలకు కాకుండా బాటిళ్లలో పెట్రోల్ పట్టాల్సి వచ్చినప్పుడు ఈ విధానాన్ని ఆఫ్ చేసే వీలుగా ఆపరేట్ చేస్తున్నారు. జిల్లాలో మరిన్ని పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐలు శ్రీనివాసులు, సద్గురుడు తదితరులు పాల్గొన్నారు.

ఐరావతంపై చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి శుక్రవారం ఐరావత వాహనంపై భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి మహారుద్రాభిషేకం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, ఆదోని చౌకి మఠం పీఠాధిపతి కళ్యాణస్వామిజీ, మఠం సహాయ కమిషనర్ కె.రాణి ఆధ్వర్యంలో చంద్రమౌళీశ్వర స్వామి మూలవిరాట్‌ను ఊరేగింపుగా ప్రత్యేక వాహనం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ఐరావత వాహనంపై ఉత్సవమూర్తిని ఉంచి భక్తులు ఊరేగించారు. కార్యక్రమంలో మఠం ఏజెంట్ రాజన్నగౌడ్, మఠం జూనియర్ అసిస్టెంట్‌లు గోపి, నారాయణస్వామి, వీర సంక్షేమ సంఘం నాయకులు పాటిల్ నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.



నేడు జేఎన్‌టీయూలో మహిళా దినోత్సవం

అనంతపురం: జేఎన్‌టీయూ ఆడిటోరియంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆడిటోరియంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

15లోపు సప్లి ఫీజు చెల్లించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 2016–17 నుంచి 2018–19 విద్యాసంవత్సరాల డిగ్రీ విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 6 సెమిస్టర్ల విద్యార్థులకు ఈ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష ఫీజు ఈ నెల 15లోగా చెల్లించాలని సూచించారు. ఈ నెల 16 నుంచి 18 వరకు రూ. వెయ్యి అదనపు రుసుముతో చెల్లించవచ్చని, 19 నుంచి పరీక్షలు ప్రారంభమయ్యే వరకు రూ.3 వేల అదనపు రుసుముతో ఫీజు చెల్లించవచ్చని స్పష్టం చేశారు. మెగా సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24న మొదలయ్యే అవకాశం ఉందని, దీనిపై త్వరలోనే స్పష్టత ఇస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో పరీక్షల విభాగాధిపతిని సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడిపత్రి టౌన్: ఆర్డీటీ ఆధ్వర్యంలో శుక్రవారం తాడిపత్రిలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి అశోక్ పిల్లర్ సర్కిల్ వరకూ ర్యాలీ కొనసాగింది. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేసారు. విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో ఆర్డీటీ సీఓ ఆంజనేయులు చౌడేశ్వరి, విజయభాస్కర్, నల్లపరెడ్డి, పాఠశాలల ప్రిన్సిపాళ్లు అమర్నాథ్, శివప్రసాద్, పీఈటీ శివప్రసాద్, దాదాఖలందర్, అబ్రహం, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఐటీ కోర్‌టీం విభాగానికి అవార్డు



హెడ్‌కానిస్టేబుల్ సుకుమార్ బాబుకు అవార్డు అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: పోలీసు శాఖకు అత్యంత ఉపయోగకరమైన క్రైం క్రిమినల్ ట్రాకింగ్ అండ్ నెట్‌వర్కింగ్ సిస్టం, ఇంటరాపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం అప్లికేషన్లను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో జిల్లా ఐటీ కోర్‌టీం విభాగానికి అవార్డు దక్కింది. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఐటీ కోర్ టీం హెడ్ కానిస్టేబుల్ సుకుమార్ బాబుకు ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు అవార్డులు రాగా, ఒక అవార్డు అనంతపురం పోలీస్ టీంకు వచ్చింది. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు ఒక కేటగిరీ, ఎస్ఐ ఆపై స్థాయి అధికారులకు మరో కేటగిరిలో అవార్డులు ప్రకటిస్తారు. ఐటీ కోర్ హెడ్‌కానిస్టేబుల్ సుకుమార్ బాబుకు ఈ అవార్డు దక్కింది. ఈ అవార్డును డీజీపీ కార్యాలయంలోని పీపీఎస్ విభాగానికి ఎన్‌సీఆర్‌బీ వారు పంపగా, అక్కడ నుంచి జిల్లాకు రావడంతో ఎస్పీ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు.

10న అప్రెంటిషిప్ మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ బాలురు ఐటీఐలో ఈ నెల 10న ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ (పీఎంఎన్ఏఎం) నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐటీఐ, ఇంటర్ ఒకేషనల్, నర్సింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఎన్‌టీసీ పొందిన విద్యార్థులు అర్హులు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకెళ్లాలి. పూర్తి వివరాలకు 88868 85173లో సంప్రదించవచ్చు.

అన్నింటా ఆమె



మండుటెండలో చల్లదనాన్ని పంచుతూ: అనంతపురం నగరంలో చెరుకు రసం బండితో ఉపాధి పొందుతున్న గ్రామీణ మహిళ

ఆమె శాంతం... ఆమె సహనం... ఆమె రౌద్రం... ఆమె లౌక్యం... అన్నింటా ఆమె... అన్నీ ఆమే! జీవన పోరాటంలో ఎన్ని గాయాలైనా లెక్కచేయదు. నేటి మహిళలు అడుగు మోపని రంగమంటూ లేదు. నైపుణ్యమున్నా ఆర్థిక పరిస్థితులు సహకరించక ఇంటికే పరిమితమైన గ్రామీణ మహిళలు సైతం తర్వాతి క్రమంలో అవకాశాలను అందిపుచ్చుకుని సాధికారతే లక్ష్యంగా సాగుతున్నారు. 'ఆమె' అంటే 'ఆకాశంలో సగం' అనేవారు ఒకప్పుడు.. కానీ 'ఆమె' ఇప్పుడు 'సగం' మాత్రమే కాదు.. 'సర్వం'.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



బరువు.. బాధ్యత : ప్లాస్టిక్ బిందెలు విక్రయిస్తున్న గ్రామీణ మహిళలు



శ్రమ శక్తి : ఇటుక పెళ్లల పరిశ్రమలో పని చేస్తున్న మహిళా కార్మికులు



మలి సంధ్యలోనూ : నగరంలోని జడ్జి బంగ్లా వద్ద రొట్టెలు విక్రయిస్తున్న వృద్ధురాలు



కాయ.. కష్టం : మార్కెట్ యార్డులో చీనీకాయలను లారీకి లోడ్ చేస్తున్న మహిళా కూలీలు



సంకల్పానికి మూడు చక్రాలు : నగరంలో ఆటో నడుపుతున్న మహిళ



కలెక్టరేట్ వద్ద గంపలో చిరుతిండ్లు విక్రయిస్తున్న వృద్ధురాలు

మహిళాభ్యున్నతితోనే మెరుగైన సమాజం

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



జెడ్పీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి

అనంతపురం సిటీ: మహిళాభ్యున్నతితోనే మెరుగైన సమాజం నిర్మితమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యతో కలసి శుక్రవారం ఆమె కేక్ కట్ చేసి, మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపి, మాట్లాడారు. అమ్మాయి, అబ్బాయిల పెంపకంలో వివక్ష చూపరాదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం గర్వంగా ఉందన్నారు. బాలికలు విద్యావంతులైనప్పుడే సమాజంలో సమానత్వం పొందగలరన్నారు. ప్రతి అమ్మాయి స్వేచ్ఛగా చదువుకునే వాతావరణం కల్పించాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులతో అమ్మాయిల చదువు ఆగిపోకూడదన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారులు షబ్బీర్‌నియాజ్, మహబూబ్ వలి, విజయ భాస్కర్‌రెడ్డి, రత్నాబాయి, శ్రీవాణి, ధనుంజయ, కమ్మ నాగరాజు, ఉషారాణి, మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్‌లో మహిళ మృతదేహం

బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో శుక్రవారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ప్రొబేషనరీ డీఎస్పీ అష్రఫ్ అలీ, ఎస్ఐ శివ, సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. సుమారు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసున్న మహిళ రెండు చేతులపై ముగ్గుల బొమ్మల పచ్చబొట్లు ఉన్నాయి. ఎర్ర రంగు జాకెట్ ధరించి ఉంది. కొన్ని రోజులుగా నీటిలో మునిగి ఉండడంతో మృతదేహం పూర్తిగా ఉబ్బి గుర్తు పట్టలేని విధంగా మారింది. పంచనామ అనంతరం అక్కడే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మహిళ మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే బెళుగుప్ప పోలీసులను సంప్రదించాలని కోరారు.

'లైనింగ్'తో హంద్రీనీవాకు మరణశాసనం

- కాంట్రాక్టర్లకు తప్ప రైతులకు ఎలాంటి ప్రయోజనమూ లేదు
- మీడియాతో మాజీ ఎమ్మెల్యే విశ్వ
- లైనింగ్ పనులు ఆపాలంటూ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వై.విశ్వేశ్వరరెడ్డి, తదితరులు

అనంతపురం అర్బన్: హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ పనులు తలపెట్టి ఆ ప్రాజెక్టుకు మరణ శాసనాన్ని కూటమి సర్కార్ లిఖిస్తోందని ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. హంద్రీ–నీవా కాలువకు పిలిచిన టెండర్లను రద్దు చేయడంతో పాటు లైనింగ్ పనులు ఆపేలా ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నామన్నారు. డిమాండ్ సాధనలో భాగంగా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో నాయకులతో కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ అధ్యక్షుడు కేవీరమణ, కూడేరు ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, రైతులు చిన్నరంగారెడ్డి, ఎర్రిస్వామి, ఆదినారాయణ, ఆనంద్ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో విశ్వ మాట్లాడారు.

అత్యంత దుర్మార్గం : జిల్లాకు ప్రాణప్రదమైన హంద్రీ–నీవా కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యం 11 వేల క్యూసెకులుంటే రోజుకు ఒక టీఎంసీ చొప్పున కృష్ణానదికి వరదలొచ్చిన 40 రోజుల్లో 40 టీఎంసీలను తీసుకురావడానికి వీలవుతుందన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 6 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం ఉండేలా కాలువ వెడల్పు చేసే పనులకు టెండర్లు పిలిచిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వాటిని రద్దు చేసి కొత్తగా ఫేస్–1 కింద 3,850 క్యూసెక్కుల సామర్థ్యానికి టెండర్లు పిలవడమే కాక, రూ.192 కోట్ల ఎక్సెస్‌కు ఆమోదించడం అత్యంత దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హంద్రీ–నీవా లైనింగ్ పనులు కాంట్రాక్టర్లకు తప్ప జిల్లా రైతులకు ఎంత మాత్రం ఉపయోగపడవన్నారు.

ప్రజలు చైతన్యవంతులు కావాలి

జీడిపల్లి నుంచి ఉమ్మడి జిల్లా సరిహద్దున పుంగనూరు బ్రాంచ్ కాలువ అప్‌టేక్ వరకు హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ చేయాలని ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ పనులు పూర్తయితే జిల్లా పరిధిలోని కాలువ పరివాహక ప్రాంతం చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బోరుబావులతో పాటు గ్రామాల్లోని తాగునీటి బోర్లూ ఎండిపోయే పరిస్థితి నెలకొంటుందన్నారు. అంతేకాక భవిష్యత్తులో కాలువ సామర్థ్యాన్ని పెంచడానికి వీలుండదన్నారు. భూగర్భ జలాలు పెంపొందే పరిస్థితులు శాశ్వతంగా మూసుకుపోతాయన్నారు. కాలువలో ప్రవహించే వర్షపు నీరు కూడా భూమిలోకి ఇంకదన్నారు. ప్రభుత్వం సేకరించిన కాలువ భూమి ఆక్రమణలకు గురవుతుందన్నారు. గతంలో హంద్రీ–నీవా ప్రాజెక్టును ఐదు టీఎంసీల మంచినీటి ప్రాజెక్టుగా మార్చడానికి చేసిన ప్రయత్నాన్ని జిల్లా ప్రజలు అడ్డుకున్నారని, అదే స్ఫూర్తితో జిల్లా ప్రజానీకం చైతన్యవంతులై పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యంగా రైతులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

సాగు, తాగునీటి కష్టాలు తప్పవు

కూటమి ప్రభుత్వ చర్యలతో రైతుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోందన్నారు. హంద్రీనీవా కాలువకు లైనింగ్ పనులు పూర్తయితే బోరుబావులు ఎండిపోయి సాగు, తాగునీటి కష్టాలు తీవ్రమవుతాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గాలేరి–నగరిని హంద్రీ–నీవాకు అనుసంధానం చేయడం ద్వారా హంద్రీ–నీవా నుంచి చిత్తూరుకు వెళ్లాల్సిన నీటిని ఆదా చేసి... కర్నూలు, అనంతపురం జిల్లాలకు మాత్రమే వినియోగించుకునేలా చేపట్టిన చర్యలను కొనసాగించాలన్నారు. గాలేరి–నగరి ద్వారా కుప్పానికి సమృద్ధిగా నీటిని ఇచ్చే అవకాశమున్నా... అనంత జిల్లా రైతులను బలిచేసి ఆ ప్రాంతానికి నీటిని తీసుకెళ్లాలనుకోవడం సబబు కాదన్నారు.

లైనింగ్‌కు టెండర్లు సరికాదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం అర్బన్: "హంద్రీ–నీవా కాలువను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలి. పంట కాల్వలు తవ్వి ఆయకట్టుకు నీరు ఇవ్వాలి' అని రైతులు కోరుతుంటూ లైనింగ్ పనులకు ప్రభుత్వం టెండర్లు పిలవడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీమ అభివృద్ధికి సాగునీటి వనరుల అభివృద్ధి కీలకమన్నారు. హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేయకుండా అత్యంత వెనబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాను ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. కృష్ణాజలాల కోసం చేసిన పోరాటాల ఫలితమే హంద్రీ–నీవా ద్వారా 2012 నుంచి జీడిపల్లికి కృష్ణాజలాలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం వస్తున్న 40 టీఎంసీలు కాకుండా అదనంగా నీరు ఇస్తామని ఎన్నికల ముందు ప్రధాన రాజకీయ పార్టీలు హామీలు ఇస్తూనే ఉన్నాయన్నారు. హంద్రీ–నీవా డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసి ఆయకట్టును స్థిరీకరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే సీఎం చంద్రబాబుతో సానుకూల నిర్ణయం ప్రకటింపజేయాలన్నారు. 6,300 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యానికి కాలువను వెడల్పు చేసేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఖరారు చేసిన టెండర్లలో 3,850 క్యూసెక్కులకే పరిమితం చేయడం, రెండవ దశ కాలువ లైనింగ్ పనులకు సిద్ధపడడం చూస్తుంటే సీఎం చంద్రబాబు తీరు ఏరుదాటాక తెప్పతగలేసినట్లుగా ఉందన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాలు... కళ్యాణదుర్గం నుంచి అనంతపురానికి గురువారం అర్ధరాత్రి వెళుతున్న అంబులెన్స్ వాహనం గొల్ల గ్రామం సమీపంలోకి చేరుకోగానే రోడ్డు దాటుతున్న అదే గ్రామానికి చెందిన కుళ్లాయప్ప (60)ను ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే మంగళకుంట గ్రామం వద్ద గురువారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్న అదే గ్రామానికి చెందిన పెద్ద మల్లయ్యను ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని స్థానికులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక శుక్రవారం ఆయన మృతి చెందాడు. ఈ రెండు ఘటనలపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ ఉప సంచాలకులు సుమన జయంతి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన బీసీ, ఈబీసీ అభ్యర్థులు అర్హులు. ఈ నెల 10 నుంచి దరఖాస్తు చేసుకోవాలి. టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తారు. పూర్తి వివరాలకు 08554–275575లో సంప్రదించవచ్చు.

అట్రాసిటీ చట్టం పటిష్టంగా అమలవ్వాలి

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎస్పీ జగదీష్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి నిజమైన బాధితులకు న్యాయం చేయాలని అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత ఆదేశించారు. 'పౌర హక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టం' అంశంపై జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎస్పీ పి.జగదీష్‌తో కలసి కలెక్టర్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు పరిహారం అందించాలని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం నుంచి రూ.58 లక్షలు నిధులు వచ్చాయన్నారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో భూములకు సంబంధించి వివరాల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి, ఆయా వర్గాల వారికి మంజూరైన యూనిట్లు గ్రౌండింగ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జోక్యం చేసుకుని బాధితులకు సరైన సలహాలు, సూచనలు అందించాలని కమిటీ సభ్యులు బీసీఆర్ దాస్, నెరమెట్ల యల్లన్న, సాకే చిరంజీవి, ఇమామ్‌వలి, రామన్న కోరారు. సమావేశంలో డీఆర్ఓ ఎ.మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, సాంఘిక సంక్షేమశాఖ జేడీ రాధిక, గిరిజన సంక్షేమాధికారి రామాంజినేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత కీలకం

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ వద్ద 'వికసిత్ భారత్ యువ పార్లమెంట్ 2025' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో రాఘవేంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రిన్సిపాల్ పద్మనాభరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, జేఎన్‌టీయూఏ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శారద, ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగశుభ, నెహ్రూ యువ కేంద్ర సంఘటన ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పది రోజుల్లో చార్జిషీట్ వేయాలి

ఎన్నికల అనంతరం జరిగిన హింసకు సంబంధించిన కేసులపై పది రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. 2024 సాధారణ ఎన్నికల అనంతరం చోటు చేసుకున్న హింస, నమోదైన కేసులపై జిల్లా అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎస్పీ పి.జగదీష్‌తో కలసి ఆయన సమీక్షించారు. తాడిపత్రిలో 7 కేసులు నమోదు కాగా ఐదు కేసుల్లో చార్జిషీట్ దాఖలైందని, ఒకటి తప్పుడు కేసుగా నిర్ధారణ అయిందని తెలిపారు. మరో కేసు ఇన్వెస్టిగేషన్‌లో ఉందన్నారు. ఎన్నికల కమిషన్ పోర్టల్ ఓపెన్ అయిన నేపథ్యంలో చార్జిషీట్ దాఖలులో పోలీసు యంత్రాంగానికి సంపూర్ణ సహకారం అందించాలని ఆర్డీఓ, తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ ఎ.మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, డీసీఆర్‌బీ హరినాథ్, తాడిపత్రి టౌన్ సీఐ సాయిప్రసాద్, తహసీల్దారు రజాక్‌వలి, ఎన్నికల డీటీ కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం పేరుతో అనధికార వసూళ్లు

- ఒక్కో సభ్యురాలితో రూ.వంద చొప్పున రూ.కోటికి పైగా వసూలు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో మెప్మా అధికారుల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కొందరు ప్రజాప్రతినిధులకు ఏమాత్రం తీసిపోకుండా మహిళా సంఘాల నాయకురాళ్ల ముక్కు పిండి అనధికారిక వసూళ్లకు అధికారులు తెరలేపారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తాయి.

11,530 సంఘాలతో రూ.కోటికి పైగా వసూలు

అనంతపురం నగరపాలక సంస్థ, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం తదితర మునిసిపాలిటీల మెప్మా పరిధిలో 11,530 మహిళా సంఘాలున్నాయి. ప్రతి సంఘంలో 10 నుంచి 12 మంది సభ్యులున్నారు. మహిళా దినోత్సవం పేరుతో వీరి నుంచి ఒక్కొక్కరితో రూ.100 చొప్పున కొందరు ఆర్పీలు వసూళ్లు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ లెక్కన రూ.కోటికిపైగా వసూలైనట్లు తెలుస్తోంది. సభ్యులు ఇదేమిటని ప్రశ్నిస్తే రూ.వంద చెల్లించాల్సిందేనని లేకపోతే భవిష్యత్తులో నిధులు మంజూరు చేయకపోవడంతో పాటు సంఘం నుంచి తొలగిస్తారని బెదిరింపులకు పాల్పడినట్లు పలువురు వాపోయారు. ఈ బాగోతం వెనుక మెప్మా విభాగంలోని ఓ కీలక అధికారి, ఓ టెక్నికల్ అసిస్టెంట్ కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి.

వసూళ్లకు పాల్పడలేదు

మహిళా దినోత్సవం పేరుతో ఎలాంటి వసూళ్లకు పాల్పడలేదు. ఎవరైనా డబ్బు ఇచ్చి ఉంటే దృష్టికి తీసుకురావాలి. ఉన్నతాధికారులకు నివేదించి సదరు ఆర్పీలు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. – విశ్వజ్యోతి, మెప్మా పీడీ

క్లుప్తంగా

మాస్టర్ నేషనల్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ


పతకం చూపుతున్న పీఈటీ జగన్ మోహన్‌రెడ్డి

ఆత్మకూరు: బెంగళూరులో ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ జరిగిన మాస్టర్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆత్మకూరుకు చెందిన జగన్ మోహన్‌రెడ్డి (ముట్టాల ఉన్నత పాఠశాల పీఈటీ) సత్తా చాటారు. ట్రిపుల్ జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచి పతకం దక్కించుకున్నారు. ప్రతిభ కనబరిచిన పీఈటీ జగన్ మోహన్‌రెడ్డిని పాఠశాల బృందం అభినందించింది.

అనధికార లేఅవుట్లపై అహుడా చర్యలు

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం, హిందూపురం డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు అనధికార లేఅవుట్లపై చర్యలకు ఉపక్రమించారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ ఆదేశాలతో పీఓ ఇసాక్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ హరీష్, తదితరులు శుక్రవారం కందుకూరు, రామినేపల్లిలోని అనధికార లేఅవుట్లలో రాళ్లను తొలగించారు. అహుడా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదన్నారు.

దంగల్ చిత్ర ప్రదర్శన

అనంతపురం: మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మహిళా డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఉచితంగా దంగల్ సినిమాను ప్రదర్శించారు. పురుషులకు ఏ మాత్రం తీసిపోని విధంగా గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఒలింపిక్స్ పోటీల్లో మహిళా విజేతగా నిలిచిన తీరు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా చిత్రాన్ని ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. మహిళల స్వీయ రక్షణ, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేలా సూచనలు, సలహాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.

నీటి సమస్య తలెత్తనీయొద్దు


మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనరసింహ

ఆత్మకూరు: వేసవి కాలం ప్రారంభం కావడంతో ఎండల తీవ్రత అధికమైంది. గ్రామాల్లో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ సూచించారు. శుక్రవారం మండలంలోని సనప, తోపుదుర్తి, వేపచెర్ల, వేపచెర్ల తండా గ్రామాల్లో ఎంపీడీఓ పర్యటించారు. పశువుల షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. షెడ్ల నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాబోవు రోజుల్లో భూగర్భ జలాలు ఎండి నీటి సమస్య ఏర్పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నీటి సమస్య ఉన్న చోట్ల బోర్లు వేయించడం, పైప్ లైన్ లీకేజీలు అరికట్టడం, మొదలగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశారు.

భక్తుల కొంగుబంగారం మలహోబిల లక్ష్మీనరసింహుడు




మలహోబిల లక్ష్మీనరసింహ స్వామి విగ్రహం, కొండపై ఉన్న మలహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన లక్ష్మీనరసింహ స్వామి ప్రతిమ

- నేటి నుంచి 16వ తేదీ వరకూ కొనసాగనున్న ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ సిబ్బంది
- పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు

ఆత్మకూరు: పంపనూరు కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలోనే ప్రఖ్యాతి గాంచిన ఆలయాల్లో మలహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఒకటి. ఏటా ఈ ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 8వ తేదీన ఉత్సవమూర్తుల విగ్రహాలను కొత్తపల్లి గ్రామం నుంచి కొండపైకి మేళతాళాలతో చేరుస్తారు. 9వ తేదీన స్వామికి అభిషేకం, ధ్వజారోహణం, కలశ స్థాపన, 10వ తేదీన మూలమంత్ర హవనం, 11వ తేదీన స్వామికి అభిషేకం, సుదర్శన హోమం, 12వ తేదీన లక్ష్మీ హోమం, అభిషేకం, గరుడోత్సవం, 13వ తేదీన స్వామి కల్యాణోత్సవం, 14వ తేదీన రథోత్సవం, 15వ తేదీన అభిషేక పూజలు, పరుష, 16వ తేదీన వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఇదీ ఆలయ ప్రత్యేకత..

పంపనూరు కొండపై 10 వేల సంవత్సరాల కాలం నాటి రాతి మీద చెక్కిన చిత్రాలు దర్శనమిస్తాయి. అలాంటి రాళ్లు చుట్టుపక్కల ఎక్కడా ఉండవని స్థానికులు చెబుతుంటారు. అంతేకాకుండా కొండపై రెండు బండరాళ్ల మధ్యలో జంట కోనేర్లు ఉన్నాయి. జంట కోనేర్లలో నీరు ఉంటుంది. అదే విధంగా ఆలయం ముందు బాగాన పెద్ద లక్ష్మీనరసింహ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మలహోబిల లక్ష్మీనరసింహ స్వామి మహిమ గల వాడని భక్తుల విశ్వాసం.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఆలయ ఈఓ దాసు తెలిపారు. ఇటీవల ఆలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసి ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తీర్మానించారు. మెడికల్ క్యాంప్, భక్తులకు నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం


పదోన్నతి పొందిన ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలోని ఉద్యోగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. పుట్టపర్తిలోని పీఆర్-పీఐయూ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కె.చంద్రశేఖర్‌ను అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నంబులపూలకుంటకు పదోన్నతిపై బదిలీ చేశారు. మడకశిరలోని పంచాయతీరాజ్ పీఆర్ఐ సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కె.రాజేంద్ర ప్రసాద్‌ను ఏఓగా పదోన్నతిపై అగళి మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పదోన్నతిపై బదిలీ అయిన ఉద్యోగులకు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తన చాంబర్‌లో ఈ మేరకు ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమానికి తాము అన్ని విధాల కృషి చేస్తున్నామన్నారు. ఉద్యోగులు కూడా విధి నిర్వహణలో చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేసి, ప్రజలకు సేవలందించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం ద్వారా జెడ్పీ ప్రతిష్టను మరింత పెంచినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, 'ఎ' సెక్షన్ ఏఓ షబ్బీర్ నియాజ్, సీనియర్ అసిస్టెంట్ అరుణకుమారి పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం రావాలి


బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి


ఉమెన్స్ డే సందర్భంగా ముగ్గు వేస్తున్న వైద్యురాళ్లు


ఓటీపీఆర్ఐలో విద్యార్థినికి సర్టిఫికెట్ పంపిణీ

అనంతపురం మెడికల్: సృష్టికి మూలం అమ్మ. మహిళలు దేవతలతో సమానమని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొందరు వైద్యులను సన్మానించారు. డెర్మటాలజీ డాక్టర్ నిహారిక, డాక్టర్ పరిణీత సాయి ప్రదర్శించిన లఘు నాటిక ఆకట్టుకుంది. అనంతరం వైద్య విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శన అందరికీ ఆకట్టుకుంది. వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, సూపర్‌స్పెషాలిటీ సూపరింటెండెంట్ బెనెడిక్ట్ కోయిలో, జీజీహెచ్ డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ప్రొఫెసర్ డాక్టర్ సంధ్య, సీనియర్ వైద్యురాళ్లు డాక్టర్ భవాని, డాక్టర్ సరళ, డాక్టర్ మంజుల తదితరులను సన్మానించారు.

ఆత్మకూరు/రాప్తాడు: మహిళా దినోత్సవం సందర్భంగా రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ మల్లికార్జునఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి, నాగరత్న, హేమలత పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన హస్తకళాకృతులు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనంతపురం: ఎస్కేయూ, జేఎన్‌టీయూ అనంతపురం ఓటీపీఆర్ఐలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బి.అనిత, డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే.మాధవి, ఫుడ్‌టెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఏ.స్వరూప రాణి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బా రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ బి. దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్. లహరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కిమ్స్‌లో శస్త్రచికిత్స విజయవంతం

అనంతపురం మెడికల్: కిమ్స్ సవీర వైద్యులు ఓ యువకుడి కడుపులో ఉన్న రాళ్లను తొలగించి, శస్త్రచికిత్సను విజయవంతం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను కిమ్స్-సవీర వైద్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. హిందూపురం ప్రాంతానికి చెందిన ఓ 23 ఏళ్ల యువకుడు కడుపు నొప్పితో బాధపడుతూ ఇబ్బంది పడేవాడు. కిమ్స్ సవీర ఆస్పత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ఎస్.మహమ్మద్ షాహిద్ యువకుడిని పరీక్షించారు. క్రానిక్ కాల్సిఫిక్ పాంక్రియాటైటిస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారణకు వచ్చారు. యువకుడికి శస్త్రచికిత్స చేసి పాంక్రియాస్‌లో ఉన్న రాళ్లను తొలగించారు.

జన ఔషధ కేంద్రాలను వినియోగించుకోండి

అనంతపురం మెడికల్: ప్రధాన మంత్రి జన ఔషధ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని రెండో రోడ్డులో నిర్వహించిన పీఎం జన ఔషధ దివస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ కంపెనీలకు చెందిన మందులను జన ఔషధ కేంద్రాల్లో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. బీపీ, షుగర్ ఉన్న వారికి ఇతర షాపుల్లో నాలుగైదు వేల రూపాయలు అయ్యే మందులు రూ.500లకే లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి, డ్రగ్స్ ఏడీ రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాప్తాడు: ఎం.బండమీదపల్లి గ్రామానికి చెందిన మాధవరాజు గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళ్తుండగా పండమేరు బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంచాలి

అనంతపురం ఎడ్యుకేషన్: డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు దాదాపు 7 వేల మందికి పైగా ఉన్నారన్నారు. ఈనెల 11వ తేదీతో ఫీజు చెల్లించేందుకు గడువు ముగుస్తుందన్నారు. అపార్ ఐడీ ఎన్రోల్ చేసుకోవడంలో చాలా ఆలస్యం అవుతూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటి దాకా 30 శాతం మంది కూడా ఫీజు చెల్లించలేదన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎస్కేయూ అధికారులు పరీక్ష ఫీజు గడువు మరింత పెంచాలని కోరారు.

సెలవు రోజుల్లోనూ పన్ను వసూళ్లు

అనంతపురం కార్పొరేషన్: సెలవు రోజుల్లోనూ ఇంటి, నీటి, ఖాళీ జాగా పన్ను చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. శనివారం, ఆదివారం కూడా నగరపాలక సంస్థలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా పన్ను వసూళ్ల చేపట్టేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు పుష్కలం

అనంతపురం ఎడ్యుకేషన్: భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు పేర్కొన్నారు. కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వ్యక్తిత్వ వికాసంపై సదస్సు ఏర్పాటు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు అశ్వర్థరెడ్డి మాట్లాడుతూ.. భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను ఎలా వృద్ధి చేసుకోవాలనే అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చరిత్ర విభాగాధిపతి సుధాకర్, అధ్యాపకులు పద్మావతి, నాగభూషణం పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించాడనే ఆత్మహత్య

అనంతపురం: ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెంది విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యుల చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అనంతపురం మూడో పట్టణ సీఐ కె.శాంతిలాల్ తెలిపారు. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లికి చెందిన ఉప్పర శివయ్య కుమార్తె విజయలక్ష్మి అనంతపురం నగరంలోని ఆరో సచివాలయంలో వార్డు ప్లానింగ్ సెక్రెటరీగా పనిచేస్తున్నారు. రామచంద్రనగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకుని నివాసముంటున్నారు. గత ఏడేళ్లుగా నార్పల మండలం నల్లపరెడ్డిపల్లికి చెందిన ఉప్పలూరి కృష్ణ నరేంద్ర, విజయలక్ష్మి ఇరువురూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని విజయలక్ష్మి కోరితే .. మాట దాటవేస్తూ కాలయాపన చేశాడు. కొంత కాలంగా విజయలక్ష్మిని దూరం పెడుతూ వచ్చాడు. ఈ క్రమంలో గురువారం పెళ్లి ప్రస్తావన తీసుకెళ్లిన విజయలక్ష్మితో మొండిగా వ్యవహరించాడు. పెళ్లి చేసుకోను .. ఏమి చేసుకుంటావో చేసుకో అని అనడంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె అదే రోజు రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబసభ్యుల కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడు ఉప్పలూరి నరేంద్రను శనివారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కొనసాగుతున్న ఎర్రిస్వామి తాత జాతర

రాప్తాడు: అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి తాత జాతరలో భాగంగా రెండో రోజు శుక్రవారం పూజలు నిర్వహించారు. సాయంత్రం ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, తుఫాన్ వాహనాలకు టెంకాయ పట్టలు కట్టి గుడి చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. ఎర్రిస్వామి తాతతో పాటు ఆలయం సమీపంలోని వినాయకుడు, గోటూకూరప్ప, రాముడు తదితర స్వాములకు పూజలు చేపట్టారు. అయ్యవారిపల్లి కాల్వగొంది నిర్వాహకుల ఆధ్వర్యంలో రాత్రి 9 గంటలకు పంచరత్నాలు నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ఉట్ల పరుష జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

'రాణి'స్తున్నారు..

సందర్భం:
నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆకాశంలో సగం, అవనిలో సగం అతివ అంటారు. అటువంటి మహిళలకు ఏ రంగంలో అయినా అవకాశం ఇస్తే తమను తాము నిరూపించుకుని విజయతీరాలకు చేరుకుంటున్నారు. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో దూసుకెళ్తున్న మహిళలు తమ విజయగాథలను 'సాక్షి'తో పంచుకున్నారు.

– రాప్తాడు, అనంతపురం కార్పొరేషన్:

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో..



మాది అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామం. మా నాన్న రాముడు, రైతు. అమ్మ నారాయణమ్మ గృహిణి. మేము నలుగురు సంతానం. ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. మాది వ్యవసాయ కుటుంబం. మానాన్న నలుగురిని బాగా చదివించారు. నేను ఎంకామ్, బీఈడీ వరకు చదివాను. గ్రూప్-2 సాధించాలనే లక్ష్యంగా సన్నద్ధం అయ్యాను. మా తల్లిదండ్రులు, నా భర్త జయరాం ప్రోత్సాహంతో గ్రూప్-2లో ఈఓపీఆర్డీగా ఎంపికయ్యాను. 2023లో ఎంపీడీఓగా ప్రమోషన్ వచ్చింది. మహిళ సాధికారత రావాలంటే మహిళలు బాగా చదువుకుని తమ కాళ్ల మీద తాము నిలబడాలి. ఇంట్లో ఇల్లాలు చదువుకుంటే తమ పిల్లల భవిష్యత్ కూడా బాగుంటుంది. మహిళల సమానత్వం అనేది ఇంటి నుంచే ప్రారంభం కావాలి.

– బి.విజయలక్ష్మి, ఎంపీడీఓ, రాప్తాడు

నాన్నే స్ఫూర్తి..



మాది అన్నమయ్య జిల్లా రాజంపేట. మా నాన్న పి.చిన్నయ్య ఏపీ ట్రాన్స్‌కోలో చిరు ఉద్యోగి. అమ్మ నాగమ్మ గృహిణి. మా నాన్నకు ముగ్గురు ఆడ పిల్లలు, ఇద్దరు మగ పిల్లలు. మీరు బాగా చదువుకుంటే ఎంత వరకైనా చదివిస్తాని.. చదువు ఆపేస్తే పెళ్లి చేస్తానని నాన్న చెప్పేవాడు. మా నాన్న చెప్పిన మాటలు ఉత్సాహం నింపాయి. 2000లో మా నాన్న అనారోగ్యంతో మృతి చెందారు. అయినా కూడా ఆయనకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు గ్రూప్-2 కోసం పట్టుదలతో సన్నద్ధమయ్యాను. 2007లో డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యాను. 2012లో తహసీల్దార్‌గా ప్రమోషన్ వచ్చింది.

– విజయకుమారి, తహసీల్దార్, రాప్తాడు

ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



'గతంతో పోల్చితే మహిళల్లో మార్పు వచ్చింది. విద్యతో పాటు ఆర్థిక స్థితిగతులు, ఆలోచనా విధానంలో స్ఫూర్తిదాయకంగా ముందుకెళ్తున్నారు. దేశాభివృద్ధిలో కీలకమైన పాత్ర నేటి మహిళలదే. వివాహం విద్య నాశాయ అన్నది పూర్వపు సామెత. ప్రస్తుత అమ్మాయిలు మూఢనమ్మకాలకు స్వస్తి చెప్పి పోటీ ప్రపంచంలో దూసుకుపోతున్నారు. మహిళ సాధికారత సాధించడానికి విద్యనే ప్రధాన మూలం. మహిళలు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి.

– డాక్టర్ అనంత మాలతి

సేవల్లో ముందుంటున్నాం



రోగులకు సేవలందించడంలో స్టాఫ్‌నర్సులదే కీలకపాత్ర. రోగి అడ్మిషన్ పొందినప్పటి నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు స్టాఫ్‌నర్సులు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవి. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండటం సంతోషం. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రౌండ్ ద క్లాక్ స్టాఫ్ నర్సులు సేవలందించారు. రోజూ 360 మంది స్టాఫ్‌నర్సులు ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సేవలందిస్తుంటారు. అనంతపురం జీజీహెచ్ స్టాఫ్‌నర్సులకు రాష్ట్రస్థాయిలో అవార్డు లభించింది. ఇదే స్ఫూర్తితో రోగులకు సేవలందించడంలో ముందుంటాం.

– నాగమణి, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్